“సమస్య అది కాదు” అసహనంగా కణతలు నొక్కుకున్నాడు ఉపాధ్యాయ “రెండు నెలల్లోగా స్టేట్స్‌కి పంపాల్సిన పదిహేను కోట్ల విలువచేసే మెటీరియల్ పంపలేకపోవడం ఒక్కటే కాదు. ఈ సమ్మె మూలంగా అన్న టైంకి సప్లయి చేయలేమన్న అపవాదుతో రేపు రాబోతున్న యురప్ కంట్రీస్ ఆర్డర్సు చేజారిపోయాయి.”

జనరల్ మేనేజర్ చెప్పాడు గొణుగుతున్నట్టుగా “ఆ సూపర్వైజర్‌పై చర్య తీసుకుందామన్నా మేన్ హేండిలింగ్ జరిగింది. అతడిపైనే తప్ప అతడు ఏ కార్మికుడిపైనా చేయి చేసుకోలేదని ప్రాథమిక దర్యాప్తులో రుజువైంది.”

సహనాన్ని కోల్పోతున్నట్టుగా అన్నాడు ఉపాధ్యాయ “లాకౌట్ ప్రకటించండి. లెట్ ది పీపుల్ గో టూ డాగ్స్”

సమావేశాన్ని అర్థాంతరంగా ముగించిన ఉపాధ్యాయకి తెలీదు కృషి వారి చర్చనంతా విందని. . .

బెడ్ రూంలో బడలికగా కూర్చుని మానసిక గ్లానితో నలిగిపోతున్న గ్రాండ్‌పాని సమీపించింది కృషి “గ్రాండ్‌పా”

ఆ సమయంలో అతడు ఒంటరితనాన్ని కోరుకుంటున్నాడు.

“నిజానికి ఇది సమస్య కాదు - ఓ సవాల్.” క్రైసిస్ మేనేజ్‌మెంట్ గురించి అవగాహన గల కృషి నెమ్మదిగా అంది. “అసాధారణమైన మీ అనుభవం ముందు నా ఆలోచన శక్తి స్వల్పమని అంగీకరిస్తున్నాను గ్రాండ్‌పా - కానీ రిస్క్ తీసుకుని కదలాల్సిన యిష్యూలో రేష్‌గా నిర్ణయం తీసుకోవడం మేనేజ్‌మెంట్ సైన్స్ అనిపించుకోదు.”

అవాక్కయినట్టుగా చూశాడు ఉపాధ్యాయ- ఆయనకి తెలిసీ కృషి తనకు సంబంధించిన ఏ విషయంలో అయినా ఇలా జోక్యం చేసుకోవడం తొలిసారి. అదికాదు ఆయన ఆలోచిస్తున్నది. కృషి విశ్లేషణ చాలా సృజనాత్మకంగా అనిపించింది.

“నువ్వు చెప్పాలనుకుంటున్నది ఏమిటి”

“ఫ్యాక్టరీ లాకౌట్ దాకా వెళితే ప్రత్యర్థి అనుకున్నది సాధించినట్టు అవుతుంది.”

ఉపాధ్యాయ భృకుటి ముడివడింది “ఎవరా ప్రత్యర్థి”

“రామనాథ చౌదరి”

హఠాత్తుగా ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది.

“నీకు చౌదరి తెలుసా”

“డబ్బుతో సమకూర్చుకున్న ఆయుధాలు గొప్పవనుకునే చౌదరి నాకు తెలుసు గ్రాండ్‌పా. . . కాని ఆలోచనా శక్తి మరింత బలమైన అణ్వాయుధమనే నా గురించి చౌదరి తెలుసుకోవాలి.”

“అంటే” సాలోచనగా అన్నారాయన “ఈ సమ్మెకి కారణం ఖచ్చితంగా చౌదరేనంటావ్”

అనుమతిస్తే-"

అర్థం కాలేదు ఉపాధ్యాయకి.

"కాదనకండి గ్రాండ్‌పా - నేర వ్యవస్థ చదరంగపు గళ్ళపై తోచిన పావుల్ని కదిలిస్తూ తాను గ్రాండ్ మాస్టర్‌ని అనుకొంటున్న చౌదరికి చెక్ చెప్పాలీ అంటే మీ సహాయం కావాలి - కనీసం ఈ ఒక్క సారికి. . ."

కృషి గొంతులోని నిజాయితీ ఆయన్ని అమితంగా కదిలించిందేమో "చెప్పు.. . ఏం కావాలి"

"అధికారం"

విస్మయంగా చూశాడు.

"యస్ గ్రాండ్‌పా . . . కేవలం ఇరవై నాలుగు గంటలు మీ అధికారాన్ని నాకిచ్చి మీరు విశ్రాంతి తీసుకోండి. అది చాలు"

"కాని-"

"నేను మీ మనవరాల్ని గ్రాండ్‌పా. . ."

ఆ వాక్యం మనసులోని ఏ పొరల్ని తాకిందో ఉదాసీనంగా చూశారాయన.

"కాబట్టే ఇరవై నాలుగు గంటలు మీ అధికారాన్ని నాకిమ్మంటున్నది. మీ శక్తి తక్కువగా అంచనా వేసి కాదు గ్రాండ్‌పా. నా శక్తేమిటో చౌదరికి తెలియచెప్పాలని."

ఒక సుదీర్ఘ మైన తపస్సుతో నిర్మించుకున్న సామ్రాజ్యాన్ని ఆమెకు ధారాదత్తం చేస్తున్నట్టుగా అన్నారాయన "ఓ.కె. . .ఏక్సెప్టెడ్."

తన దక్షత, కార్యదీక్ష తెలియాల్సింది తాతయ్యకో లేక చౌదరి అనబడే బలమైన ప్రత్యర్థికో ఖచ్చితంగా కృషికీ తెలీదు.

రాత్రి తొమ్మిదిన్నర గంటల కల్లా పర్సనల్ మేనేజరు శరత్ చంద్రని ఇంటికి రప్పించింది కృషి సూటిగా అడిగింది "ఫ్యాక్టరీలోని రూలింగ్ యూనియన్‌తో సరిపడని వ్యక్తుల వివరాలు చెప్పగలరా."

చాలా చిన్న ప్రశ్నది - కాని ఆ ప్రశ్నతోనే ఆమె ఆంతర్యం స్పష్టంగా అర్ధమైపోయింది. అదికాదు కృషిలో అతడు గమనించింది. సౌందర్యపు గ్రహాంతరాల లోతులనుంచి మేధస్సు రేడియం అక్షరాలై కనిపించి అతడ్ని క్షణంపాటు వివశుడ్ని చేసి కంగారు పెట్టింది.

ఫ్యాక్టరీలో కార్మిక సంఘాలను విభజించి పాలించాలనే సంకల్పానికి అనుగుణంగా కార్మికుల్లోని అసంతృప్తిని ఆధారం చేసుకుని కొందరు ఏక్టివ్ మెంబర్లని తయారు చేయడమో లేక తయారైవున్న వాళ్ళని గమనించడమో యజమాన్యపు బాధ్యతల్లో ఒకటిగా తెలిసిన శరత్ చంద్ర నెమ్మదిగా అన్నాడు. . ."చాలా కాలం నుంచి యూనియన్ ఆధిపత్యాన్ని సొంతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్న వాళ్ళలో సుధీర్ కుమార్ ఒకడు. సుమారు పదిహేనేళ్ళుగా మెషిన్

ఓడిపోయాడు. . . కార్మికుల్లో చాలా మంది అతడికి అనుకూలంగా వుంటున్నా గెలిచే మెజారిటీ మాత్రం సంపాదించలేకపోతున్నాడు. . . అతడ్ని కొనేసో లేక బెదిరించో తన మనిషిగా మార్చుకోవాలని రాజారావు రాయబారాలు పంపుతున్నా కొరుకుడు పడనివ్వడంలేదని ఇంటెలిజన్స్ రిపోర్టు ద్వారా తెలిసింది.”

తల పంకించింది సాలోచనగా “ప్రతి మనిషీ అమ్ముడుపోతాడు మిస్టర్ శరత్ చంద్ర. . . కాకపోతే కొనడానికి ఉపయోగించాల్సింది కరెన్సీయా లేక మరొకటా అన్నది మన మేధస్సుకి సంబంధించింది. . . మీరు వెంటనే అతడి పర్సనల్ ఫైలు నాకు పంపించండి.”

ఓ కార్మికుడు ఫ్యాక్టరీలో చేరినప్పటి అపాయింట్‌మెంటు ఆర్డరు మొదలుకుని అతడికి సంబంధించిన ప్రమోషన్స్, అతడి నడవడికకి సంబంధించిన మెరిట్ రేటింగ్, అతడిపై తీసుకున్న క్రమశిక్షణా చర్యల వివరాలుండేదే పర్సనల్ ఫైల్.

ఇరవై నాలుగు గంటల్లో తేల్చాల్సిన ఓ విషయం గురించి కృషి పోరాటం ప్రారంభించిందని తెలియని శరత్ చంద్ర అరగంట వ్యవధిలో ఫ్యాక్టరీ నుంచి తనే స్వయంగా సుధీర్ కుమార్‌కి చెందిన పర్సనల్ ఫైల్ తెచ్చిచ్చాడు. . . ఆమె ఆదేశంపై అదే రాత్రి సుధీర్ కుమార్‌ని తీసుకురావడానికి తనే వెళ్ళాడు కూడా. ఓ మామూలు కార్మికుడి కోసం ఫ్యాక్టరీ ఎగ్జిక్యూటివ్స్ అలాంటి మర్యాదలు పాటించడం ఆనవాయితీ కాకపోయినా కనీసం వందల సంఖ్యలో కార్మికుల్ని అనుకూలురుగా మార్చుకున్న సుధీర్‌కుమార్‌లాంటి అస్త్రం కోసం యిది తప్పనిసరి.

ఆ విషయాన్ని చెప్పింది కూడా కృషే.

రాత్రి పదకొండున్నరకల్లా సుధీర్ కుమార్ వచ్చాడు. కృషి కూర్చున్న ఛాంబర్‌లో అడుగుపెడుతూనే ఆశ్చర్యపోయాడు సుధీర్ కుమార్. నిజానికి అతడు ఊహించింది తను ఉపాధ్యాయుగార్ని కలుసుకోబోతున్నానని.

అప్పటికే అతడి పర్సనల్ ఫైలంతా స్టడీ చేసిన కృషి సుధీర్ కుమార్‌ని ఆపాదమస్తకం పరిశీలిస్తూ “ప్లీజ్ బీ సీటెడ్” అంది సాదరంగా.

ధైర్యంగా ఆమె ముందున్న సీటులో కూర్చున్న సుధీర్‌కుమార్ మోచేతిని టేబుల్‌పై ఆనించబోయి మళ్ళీ వెనక్కి తీసుకున్నాడు. అది చాలు అతడి ప్రస్తుత మానసిక స్థితేమిటో గ్రహించేయటానికి.

తను దేనికీ జంకనని చెబుతూనే శరీరం సహకరించక తన ఇన్‌ఫీరియారిటీని ప్రదర్శించే బాడీ లాంగ్వేజ్ అది.

కృషి మనస్తత్వ శాస్త్రాన్ని క్రోడీకరించుకుంటూ నిశ్శబ్దంగా వుండిపోయింది చాలా సేపటిదాకా. అలాంటి సన్నివేశాలలో మాటలకన్నా మౌనం ఏ మనిషినైనా ఎంతటి ఆందోళనకి గురిచేసేదీ ఆమెకు తెలుసు. “మిస్టర్ సుధీర్ కుమార్. . . మనం ప్రోస్పరిటీలో వున్నప్పుడు

గుర్తుకొస్తారంటారు. నిజానికి యిది బాధాకరమైన స్టేట్‌మెంట్ అయినా ఎవరూ కాదనలేని సత్యం. ఇప్పుడు మిమ్మల్ని యింత అర్జెంటుగా రప్పించింది ఓ స్నేహితుడిగా మాకు సహకరించమనే తప్ప మిమ్మల్ని అవకాశవాదంతో కొనేయాలనీ, ప్రలోభ పెట్టాలనీ కాదు."

ఆ చివరి వాక్యం సుధీర్‌నెంత బలంగా ఆకట్టుకుందీ అంటే కొన్ని క్షణాల క్రితం దాకా అతడిలో వున్న అనుమానం చెదిరిపోయింది.

"దీక్ష గల వ్యక్తులే తెలివైనవాళ్ళూమూ లేక సమర్ధులమూ అనుకున్న వ్యక్తులకన్నా ఎక్కువ గెలుపు సాధించగలరన్న నిజాన్ని మీరు నమ్మి తీరాలి. . ." ప్రతి వాక్యాన్నీ కేవలం సుధీర్ కుమార్‌కే అన్వయించినట్టుగా చాలా జాగ్రత్తగా సంధిస్తూంది కృషి. "ఎప్పుడో ఒకనాడు తండ్రి మరణించిన ఓ అబ్బాయి తన చిన్న యింటికి సమీపంలో వున్న గోల్ఫ్ కోర్సుని చూస్తూ ఎప్పటికైనా గోల్ఫ్ నేర్చుకోవాలని కలలు కనేవాడు. పేదరికంతో చదువుని సెవెంత్ స్టాండర్డ్ దగ్గరే ఆపేసిన ఆ అబ్బాయికి ఖరీదయిన గోల్ఫ్ కోర్సులో అడుగుపెట్టడమే కష్టమైన పని కావడంతో నిరుత్సాహపడలేదు. పట్టుదల, దీక్ష అతడ్ని వెంటాడుతుంటే తోటమాలిగా ఆ గ్రౌండ్‌లో అడుగుపెట్టాడు. ఖరీదయిన వ్యక్తులు ఆడే గోల్ఫ్‌ని గమనిస్తూ చిన్న బంతిని సంపాదించి సోడా బాటిల్స్‌తో కొడుతూ తన స్కిల్ పెంచుకున్నాడు."

తండ్రి లేకుండా పెరిగిన సుధీర్ కుమార్ సెవెంత్ స్టాండర్డు దగ్గరే చదువు ఆపేశాడు. ఫ్యాక్టరీలో రోజు కూలీకి చేరి సీనియర్ వర్కర్‌గా ఎదిగిన ఆ వ్యక్తి చాలా ఏకాగ్రతగా వింటున్నాడు కృషీ చెబుతున్న విషయాన్ని.

"ఒకనాడు" ఇందాకటి చర్చని కొనసాగిస్తూ అంది కృషి "చాలామంది చేత నిరసించబడిన ఆ అబ్బాయి పట్టుదలతో గార్డెనర్‌గా గోల్ఫ్ కోర్సులో ప్రవేశం సంపాదించిన ఆ వ్యక్తి ఇప్పుడు ప్రపంచంలోని ప్రముఖ గోల్ఫర్స్‌లో ఒకడు. తనే లీట్రెవినో. అమెరికాకి చెందిన ప్రముఖుడు నాకు పరిచయమైన వ్యక్తి కాబట్టే అతడి జీవితం గురించి మీకు చెప్పాలనిపించింది.... " క్షణంపాటు సుధీర్‌కుమార్ కళ్ళల్లోకి చూసింది.

అతడు పూర్తిగా ట్రాన్స్‌లోకి వెళ్ళకపోయినా ఆమె మాటలకి బలంగా స్పందించిన విషయం అతడి ముఖకవళికలే తెలియజెపుతున్నాయి.

"ప్రత్యేకించి ఇదంతా మీకు మాత్రమే చెప్పడంలో నా వుద్దేశ్యం మీరు దీక్ష దక్షతగల కార్మికుడు మాత్రమే గాక కొన్ని వందల మందిని ఇన్‌ఫ్లుయెన్స్ చేయగల సమర్ధుడైన నాయకుడిగా కూడా మీకు చరిత్ర వుంది. యాజమాన్యాన్ని బద్ధశత్రువులుగా భావించే అందరు కార్మిక నాయకుల్లో మీరు ఒకరు కాదు. . . మీరు అలాంటి వ్యక్తే అయితే యీపాటికే సూడో లీడర్ అయిన రాజారావుతో చేతులు కలిపేవారు. మీరు కోరేది మీ తోటి కార్మికుల ఎదుగుదల. . . అలాంటి మీరు. . ." తను చెప్పాల్సిన అతి ముఖ్యమైన విషయాన్ని చాలా జాగ్రత్తగా అతడి మనసు పొరల్లోకి ఇంజెక్టు చేసింది. "ఇంత జరిగినా నిశ్శబ్దంగా వూరుకోవడం నా

అంటే ఖచ్చితంగా కార్మికులే అంటాన్నేను. ఓ ఫ్యాక్టరీ లాకౌట్ అయితే ఉపాధ్యాయ కుటుంబానికి అదో ఆర్థికమైె యిబ్బంది కాదు. నిజం మిస్టర్ సుధీర్‌కుమార్...
ఎన్ని తరాలు గడిచినా తరగని సంపదవున్న మా తాతయ్య ఆలోచిస్తున్నది మీ జీవితాల గురించే. . . ఓ రాజకీయ నాయకుడు స్వార్థంతో మొదలుపెట్టిన సమ్మె అతడి ఇమేజ్‌ని పెంచుతుంది కాని ఫ్యాక్టరీ నష్టాలకి గురిచేస్తుంది. అంటే కార్మికులు న్యాయబద్ధంగా సాధించాల్సిన చాలా డిమాండ్స్‌ని అంటే. . .సొంత యిళ్ళు, కార్మికుల కుటుంబాలకోసం మేం కట్టించాలనుకుంటున్న హాస్పిటల్స్, మీ పిల్లల చదువులకి మేం కేటాయించాలనుకుంటున్న ఉపకారవేతనాలు అన్నీ మీరు కోల్పోయే అవకాశమిది".

విభ్రమంగా చూస్తున్నాడు సుధీర్ కుమార్ . . . ఇంతకాలం రాజారావులాగే తనూ నాయకుడు కావలనుకుంటున్నాడు తప్ప కృషి చెప్పిన శాశ్వతమైన లాభాల నాశించే కార్మిక శ్రేయస్సు కోసం తనూ ఆలోచించలేదు.

"బహుశా మిమ్మల్ని డబ్బిచ్చి కొనాలని యిలా పిలిపించి వుంటారేమో అని మీరు పొరపాటు పడి వుండొచ్చు. కాని దురదృష్టవశాత్తూ నేను ఆ సంస్కృతిలో పెరిగిందాన్ని కాదు. . . అలాంటి తాత్కాలికమైన పరిష్కారాలు నాకిష్టం వుండదు."

"కృతజ్ఞుడ్ని మేడమ్. . . మీరు నన్నిలా గుర్తించినందుకు అదృష్టవంతుడ్ని ... వెళతాను"

ఆమె వారించలేదు. సుధీర్ కుమార్ వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళటానికి కారు ఏర్పాటు చేయడమూ ఆమె మరిచిపోలేదు.

అలాంటి చిన్న విషయాలే వ్యక్తుల్ని ఎంత బలంగా ఆకట్టుకునేదీ అన్న విషయంతో బాటు ఆ తర్వాత ఓ ఉద్యమంలా సుధీర్ కుమార్ ఎంత శ్రమపడేదీ ఆమెకు తెలుసు.

"ఎందుకు పిలిచినట్టు. ఏం సాధించినట్టు" రాత్రి పన్నెండు గంటలు దాటుతుండగా అడిగాడు ఉపాధ్యాయ "కేవలం ఉపదేశాలతో అతడు ఇన్‌స్పైరై నీకు సహకరిస్తాడనుకున్నావా"

"లేదు గ్రాండ్‌పా - అందరిలో నేనూ ఒకదాన్ని కాలేక ఇక్కడే బేరసారాలు మొదలు పెట్టలేదు. కాని అతడ్ని కొనేయబోతున్నాను మోరల్‌గా"

అర్థంకానట్టు చూశాడు ఉపాధ్యాయ - ఇంకా పాతికేళ్ళు సైతం నిండని ఓ అందమైన అమ్మాయి తన అనుభవాన్ని ప్రశ్నిస్తున్నట్టుగా అనిపించింది.

"మీ స్థాయిలో మీరు చూడాల్సింది గెలుపే తప్ప అయిన ఖర్చు కాదు" నిశ్చలంగా అంది కృషి. ఆ ఖర్చుకూడ మీ యిమేజ్‌ని శాశ్వతంగా పెంచేదిగా మీ ప్రత్యర్థిని బలంగా దెబ్బతీసేదిగా మారేటప్పుడు ఖర్చుకి అసలు వెనికాడకూడదు కదా గ్రాండ్‌పా".

ఉపాధ్యాయ భృకుటి ముడిపడింది "నువ్వు దేని గురించి మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడంలేదు"

"ప్రతిష్ట, పరపతి కోసం అహోరాత్రులు శ్రమించే మీరు చౌదరి ముందు ఓడిపోవడం మీ

కట్టించాలనుకున్న హాస్పిటల్ లేండ్‌లో చౌదరి గుడిసెలు వేయించి మిమ్మల్ని మానసికంగా దెబ్బతీయటాన్ని నేను అంగీకరించలేక సుధీర్ కుమార్‌ని ట్రాప్ చేసే ప్రయత్నం చేశాడు ఇప్పుడు తిరుగులేని గెలుపు సాధించబోతున్నాను."

"ఎలా?"

"చౌదరి పదెకరాల మన లేండ్‌లో గుడిసెల్ని వేయించింది తాత్కాలికంగా మీ మీద గెలుపు సాధించాలని, ఆ తర్వాత తను సొంతం చేసుకోవాలని. నిజానికి ఆ గుడిసెల్లో చౌదరిని సపోర్టు చేసే మన ఫ్యాక్టరీ కార్మికులూ వున్నారు."

"అయితే. . ."

"ఇప్పుడు అర్జెంటుగా వాళ్ళకి మనం పట్టాలను పంపిణీ చేయబోతున్నాం. ఆ విధంగా చౌదరి ఆట కట్టించి జాగాని మనమే సొంతం చేసుకోబోతున్నాం. ఎలా అనకండి. ఆ విషయం నాకు వదిలేయండి."